

# మోసగాళ్ళకు మోసగాడు

అబ్దుల్లా హసన్‌కి పెళ్ళి నిశ్చయమైంది. పెళ్ళి కూతురికి నగలు కొనుక్కు రమ్మని తండ్రి అతడిని బాగ్దాద్ నగరానికి పంపించాడు. డబ్బు సంచీ జాగ్రత్తగా దుస్తుల్లో దాచుకుని అబ్దుల్లా హసన్ బాగ్దాద్ చేరుకున్నాడు. నగరం అతడికి కొత్త కాబట్టి నగల దుకాణాలు ఎక్కడున్నాయో తెలియలేదు.

"అయ్యా! నగల దుకాణాలు ఎక్కడ వుంటాయి? దయచేసి చెప్పండి?" అని దారిన పోతున్న జలాలుద్దీన్ అనే అతడిని అడిగాడు హసన్.

అబ్దుల్లా హసన్‌ని చూడగానే పల్లెటూరి వాడని జలాలుద్దీన్‌కి అర్థమైంది. నగరానికి వచ్చే అమాయకుల్ని మోసం చేసి దోచుకోవడమే అతడి వృత్తి.

"నగల దుకాణాలతో నీకేం పని? నీ పేరేమిటి? ఏ వూరునుంచి వచ్చావు?" అని జలాలుద్దీన్ ప్రశ్నించాడు.

తను ఒక పల్లెటూరి నుండి వచ్చాననీ, తనకు పెళ్ళి నిశ్చయమైందనీ, వధువుకు నగలు కొనడానికి వచ్చాననీ హసన్ చెప్పాడు.

జలాలుద్దీన్ ఎగిరి గంతేశాడు.

"అలాగా భాయ్! అయితే జాగ్రత్తగా వుండు. నీ దగ్గర డబ్బున్న సంగతి ఎవరికీ తెలియనియ్యకు. అసలే రోజులు బాగా లేవు. జేబు దొంగలు నగరం నిండా తిరుగుతున్నారు. నా వెంటరా! నీకు నగల దుకాణం చూపిస్తాను" అన్నాడు.

హసన్ అతడిని నమ్మాడు. జలాలుద్దీన్ హసన్‌ని తన వెంట కొంత దూరం తీసుకు వెళ్ళాడు. ఇంతలో భోజనశాల వచ్చింది. తనకు ఆకలిగా వుందనీ, భోజనం చేసి వస్తాననీ లోపలకు వెళ్ళాడు. ఈ లోపల అమీనా తండ్రిని కలిసింది. ఇద్దరూ కలిసి హసన్‌ని ఎలా మోసం చేసి డబ్బు దోచుకోవాలో ఆలోచించుకున్నారు.

కొంచెం సేపటికి హసన్ భోజనం ముగించుకుని బైటకు వచ్చాడు.

అతడు వచ్చీ రాగానే అమీనా చెయ్యి పట్టుకుని ఏడవ సాగింది.

హసన్ బిత్తరపోయి "ఏయ్! ఎవరు నువ్వు? వదుల్లు" అంటూ గింజుకోసాగాడు.

జనం వారి చుట్టూ చేరారు.

"ఏమ్మా? ఏం జరిగింది?" అని ప్రశ్నించారు.

అమీనా ఏడుస్తూ 'అయ్యలారా! ఈ హసన్ నా భర్త. ఉద్యోగం సద్యోగం లేకుండా తిరుగుతుంటే మా నాన్న ఇల్లరికం పెట్టుకున్నాడు. ఇతగాడు ఈ మధ్య జూదానికీ, తాగుడికీ అలవాటుపడి మమ్మల్ని వేధిస్తున్నాడు. మా నాన్న దాచుకున్న డబ్బు తీసుకుని పారిపోయాడు. ప్రొద్దుట్నుంచీ వెతుకుతుంటే ఇప్పటికి దొరికాడు' అంది.

అమీనా ధోరణి చూసి హసన్‌కి చిర్రెత్తుకొచ్చింది.

"అంతా అబద్ధం. ఇదెవర్తో నాకు తెలీదు. నన్ను మోసం చేసి నా డబ్బు కాజేయడానికి ఎత్తులు వేస్తోంది" అని కేకలు పెట్టాడు.

కాని అతడి మాటలు ఎవరూ నమ్మలేదు. అమీనా చెప్పిందే నిజమని నమ్మారు జనం. తలొక మాటా అన్నారు.

ఇంతలో జలాలుద్దీన్ గుంపులోకి చొరబడ్డాడు. తండ్రిని చూడగానే అమీనా భోరున ఏడ్చింది.

జలాలుద్దీన్ హసన్ని తిట్టి "నీకు పిల్లను ఇచ్చినందుకు నాకు శని పట్టిందిరా వెధవా! నా ఇంట్లోనే దొంగతనం చేస్తావా? ఇక ఒక్క పూట కూడా నీకు తిండి పెట్టను. నువ్వు నీ పెళ్ళాన్ని తీసుకుని ఎటైనా పో" అంటూ అతడి దగ్గరున్న డబ్బు సంచి కాస్తా లాగేసుకున్నాడు.

"నాకు ఇప్పుడు దిక్కెవరు అల్లా" అని ఏడ్చింది అమీనా తండ్రిని కౌగలించుకుని.

"నీకు మొగుడే దిక్కు" అని పైకి అని, నెమ్మదిగా "వాడిని ఎక్కడైనా వదిలేసి ఇల్లు చేరుకో" అని గుసగుసలాడాడు చెవులో.

అక్కడ చేరిన వాళ్ళంతా హసన్‌కి బుద్ధి చెప్పారు. "ఇప్పటికైనా కష్టపడి పని చేసుకో, భార్యని పోషించు. మామ ఇంట్లో పడి తినడం ఎంత సిగ్గుచేటు" అన్నారు.

అంతా ఎవరి దారిన వాళ్ళు వెళ్ళి పోయారు. హసన్ జరిగిన దానికి చింతిస్తూ, ఏం చేయాలో దిక్కుతోచక విచారంగా కొంత దూరం నడిచాడు. అమీనా కూడా అతడిని అనుసరించింది.

"ఎవరు నువ్వు? నన్ను ఎందుకు మోసం చేశారు? అని అడిగాడు హసన్.

అమీనా నవ్వి "మోసం మా వృత్తి చిన్నోడా! ఇక నీ దారిన నువ్వెళ్ళు" అంది తను జారుకుంటూ.

హసన్ ఆమె చేతిని గట్టిగా పట్టుకుని "నిన్నంత తేలిగ్గా వదుల్తానా? పద. నువ్వు ఇప్పుడు నా పెళ్ళానివి" అన్నాడు.

అమీనా తెల్లబోయి గత్యంతరం లేక అతడిని

అనుసరించింది. కొంత దూరం పోయాక బానిసల్ని అమ్మే చోటు వచ్చింది. ఆడవాళ్ళని వేదిక మీద నిలబెట్టి ఒక్కొక్కర్నే వేలం వేస్తున్నారు వారి యజమానులు.

హసన్ అమీనాను లాక్కెళ్ళి "ఈ పిల్ల నా బానిస. మంచి ధర వస్తే అమ్మేస్తాను" అన్నాడు నిర్వాహకుడితో. అతడు ఒప్పుకున్నాడు. అమీనా ఏడ్చి మొత్తుకున్నా లాభం లేకపోయింది. ఆమె బురఖా కాస్తా లాగేసి వేలంపాట మొదలుపెట్టారు.

ఇంతలో అక్కడికి జలాలుద్దీన్ చేరుకున్నాడు. తన కూతుర్ని వేలం వేస్తుండే సరికి గుండె బాదుకున్నాడు. ఆ పిల్ల నా కూతురు ఇంకా పెళ్ళి కాలేదని మొత్తుకున్నాడు. కాని నిర్వాహకుడు వినలేదు. ఆ పిల్ల హసన్ బానిసే అన్నాడు.

జలాలుద్దీన్ పాదుషా కోటకి వెళ్ళాడు. అప్పుడు బాగ్దాద్‌ని హరూన్ అల్ రషీద్ పరిపాలిస్తున్నాడు. తన కూతుర్ని హసన్ అనేవాడు ఎత్తుకెళ్ళి అమ్మేస్తున్నాడని ఫిర్యాదు చేశాడు. పాదుషా భటుల్ని పంపి హసన్ని, అమీనాను పిలిపించాడు.

"జహాపనా! ఈ అమీనా నా భార్య కాని మాట నిజమే" అని ఒప్పుకున్నాడు హసన్. "మరి అటువంటప్పుడు ఆ పిల్లను నీ వెంట తీసుకెళ్ళి బానిసగా అమ్మి వేయడం నేరం కదా?" అని ప్రశ్నించాడు పాదుషా.

"నేరం ఎలా అవుతుంది హుజూర్? ఈ పిల్లని ఆమె తండ్రి మాంసం అమ్మే బజార్లో భోజనశాల దగ్గర నాకు అమ్మేశాడు. నా దగ్గర నాలుగు వేల దీనారాలు తీసుకున్నాడు. కావాలంటే అక్కడి సాక్షుల్ని విచారించండి" అన్నాడు హసన్.

పాదుషా అక్కడ సాక్షుల్ని పిలిపించి విచారించి అడిగాడు. జలాలుద్దీన్, అమీనాల నాటకం బయట పడింది. హసన్ డబ్బు అతడికి ఇప్పించి తండ్రీ, కూతుళ్ళని జైల్లో పడెయ్యమని ఆజ్ఞాపించాడు పాదుషా.

